కథ

# మామూలు కథ

''మనింటి పక్క ఈ స్థలం ఖాళీగా వుండటం పెద్ద ఇబ్బందిగా తయారైంది. వీధిలో వాళ్ళంతా ఆచివరి నుంచి ఈచివరి వరకు వున్న ఇళ్ళలో చెత్తంతా ఇక్కడే వేస్తారు. రెండడుగులేస్తే మునిసిపాలిటీ చెత్తకుండీ వుంది కదా. ఒక్కరూ దాన్ని ఉపయోగించరు. అసలే దోమలతో ఛస్తున్నాం. మునిసిపాలిటీ వర్కర్సు కూడా రావటం లేదు. స్ట్రైక్ చేస్తున్నారో ఏమో..'' శ్రీమతి పరాగతంలో సణుక్కుంటోంది.

నేను వినాలనే వింటూనే వున్నాను. కానీ నేనేం చెయ్యగలను? నేనేం చెయ్యలేనని తనకీ తెలుసు. ముఖ్యంగా మా యింటి ముందు ఇంటివాళ్ళు మరీ దారుణం. వాళ్ళ పెరటి వాకిలి మా వీధి వాకిలి ఎదురుగా వుంటుంది. రోడ్డుకి అటువైపు మా ఇంటి గుమ్మం ఎదురుగా చెత్తాచెదారం పేరుకుని వుంటుంది. అప్పుడప్పుడు మా పనిమనిషి వాళ్ల పని మనిషితో దెబ్బలాడుతుంటుంది.

మా ఆవిడ కూడా గొంతు కలుపుతుంటుంది వాళ్ళు 'పెద్ద'వాళ్ళు నౌఖరు-చాకర్లు తప్ప అసలు వాళ్ళెవరూ బయటకు కనపడరు. ఇక ఈ స్వల్ప విషయం మీద పనిగట్టుకు వెళ్ళి ఫిర్యాదు చెయ్యలేక -మరీ గలీజుగా వుంటే ఐదో-పదో మునిసిపాలిటీ వాళ్ళకి ఇచ్చి మా ఆవిడే శుభ్రం చేయిస్తుంది. ఇంటింటికీ వెళ్ళి ''పరిశుభ్రతను పాటించండి..మునిసిపాలిటీ కుండీని ఉపయోగించండి'' అని ప్రచారం చెయ్యలేక నోరుమూసుకుని భరిస్తున్నాం.

''వస్తారులే! ఇదిగో..నాలుగు రోజులు వరసగా బ్యాంకు సెలవలు కదా. ఈ రెండు వేలు జాగ్రత్త చెయ్యి. ఈ నెలకింతే మరి దీన్లోనే సర్దుకోవాలి..జీతం వచ్చేదాకా'' పండగని చెప్పి ఎక్కడ బడ్జెట్ పెంచేస్తారోనని పిల్లలకు కూడా వినపడేట్లు మా ఆవిడను హెచ్చరించాను.

దిగువ మధ్య తరగతికి ఒక మెట్టుపైనా..ఎగువ మధ్య తరగతికి ఒక మెట్టు క్రిందా వుంటుంది మా ఆర్థిక వ్యవస్థ. అవటానికి ఆఫీసర్‌గిరియే వెలగబెడుతున్నాను. కానీ అది హోదాకి మాత్రమే! మా డిపార్ట్‌మెంట్ ఉద్యోగుల సంక్షేమార్థం లక్షలు-లక్షలు పరపతి సౌకర్యం కల్పిస్తుంది. సర్వీసు మొత్తం మీద రికవరయ్యే విధంగా దీర్ఘకాలిక 5 లక్షల ఇంటి అప్పు-ఇది కాక వెహికల్ లోన్..టీవీ, ఫ్రిజ్..హోమ్ అప్లయన్సెస్..పిల్లల ఉన్నత విద్యకు, మెడికల్ ఎక్స్‌పెన్సెస్..ఒకటేమిటి సర్వ సదుపాయాలకూ ఇన్‌స్టిట్యూషనల్ లోన్ తక్కువ వడ్డీకి లభిస్తుంది. నాకు వచ్చే జీతం 12వేలైతే టేక్ హోం మూడువేలు. ఏదైనా పెద్ద ఖర్చు వచ్చిపడితే రెన్యూవల్ సదుపాయం కూడా వుంటుంది. మా ఉద్యోగ సంఘాలు కూడా మేనేజ్‌మెంట్‌తో చర్చలు జరిపి ఇంకా, ఇంకా అధికమొత్తంలో కొత్త, కొత్త అప్పులు ఇప్పించటానికి కృషి చేస్తుంటాయి. ఆఖరికి ప్రావిజెన్స్ కూడా క్రెడిట్ కార్డు మీద తెచ్చుకోవచ్చు. ఇన్ని పరపతి సదుపాయాలుండటం వల్ల మాది కాస్త పోష్‌లైఫ్ అనిపిస్తుంది. అన్ని వసతులూ వున్నాయి. ఉండటానికి స్వంత ఇల్లు..ఒక పోర్షన్ వెయ్యిరూపాయలకి అద్దెకిచ్చాం.

అందుకే మా ఆవిడను అలా హెచ్చరించటం జరిగింది.

''నాకు తెలియదా..ఏమిటి..ముందు మీరు అనవసరంగా ఖర్చు చెయ్యటం తగ్గించండి'' నేను కాస్త ఖర్చు మనిషినని మా ఆవిడ ఉద్దేశ్యం. అందుకే నేను బడ్జెట్ ప్రతిపాదన చేసినప్పుడల్లా సన్నగా చురకేస్తుంది.

''వసూ టెలిఫోన్ చూడ్డానికి ఎవరూ రాలేదా?'' ఫోన్ వారం రోజుల్నుంచి డెడైంది. ఎన్నిసార్లు కంప్లైంట్ చేసినా ఎవరూ రావటం లేదు.

''లేదు''

రావుగారింటికి వెళ్ళాను. వాళ్ళ ఫోన్ లోంచి ఇంకోసారి కంప్లైంట్ చేద్దామని. ''డేవిడ్ గారూ.. మా ఫోన్ చూడ్డానికి పంపుతానన్నారు. పంపలేదే. వారం రోజుల్నుంచీ డెడ్..చాలా ఇబ్బందిగా వుందండీ..'' సహనంగా చెప్పాను. డేవిడ్ నాకు మంచి పరిచయస్థుడే. ఏదో ఒక పని మీద మా ఆఫీసుకి వస్తుంటాడు. డేవిడ్ కూల్‌గా క్లుప్తంగా అన్నాడు. ''పండగ కదండీ స్టాఫంతా బిజీగా వున్నారు. పంపుతాలెండి. ఆ..మావాళ్లు మిమ్మల్ని కలవలేదా..''

''లేదండీ'' అని ఫోన్ పెట్టేశాను.

''ఎందుకు'' అని అడగటం అనవసరం.

రావుగారి అమ్మాయి మా ఇంట్లోంచి నీళ్ళు తెస్తోంది.

''ఏమిటండీ మాణిక్యం వచ్చి పంపు బాగుచెయ్యలేదా?'' రావుగారిని అడిగాను. మా వీధిలో మునిసిపాలిటీ బోరింగ్ పంపు చెడిపోయింది. పదిరోజులైంది. వీధిలో అందరూ పదే పదే మునిసిపల్ కార్యాలయానికి ఫిర్యాదు చేసారు. అయినా సమస్య పరిష్కారం కాలేదు. ఆడవాళ్ళు నీళ్ళకు అవస్థలు పడుతున్నారు.

''లేదండి. వెయ్యి రూపాయలడిగాడు మాణిక్యం..అలా అయితేనే చేస్తానని బేరాలాడుతున్నాడు. మన వీధిలో పది కుటుంబాలున్నాయి కదా ఒక్కోరి దగ్గర్నించి వసూలు చేసి 500 ఇస్తామన్నాం..''

''ఏమన్నాడు?''

''ఏమంటాడు. సరే తరువాత వీలు చూసుకుని వస్తానని తప్పుకున్నాడు. దసరా మామూళ్ల వేటలో బిజీగా తిరుగుతున్నాడు.''

''అయితే పండగయ్యేంతవరకూ ఇబ్బందే''

ఉదయం తెల్లారకుండానే పండగ సందడి మొదలైంది. సెలవురోజు కావటం వల్ల హడావుడి లేకుండా కాఫీ తాగుతూ పేపరు చూస్తున్నాను.

గేటు తీసుకుని ఆరుగురు వ్యక్తులు వచ్చారు. ''నమస్తే సార్..'' పెదవులతో అని నోటు పుస్తకం తీసి నా పేరు వెతికి పట్టుకున్నారు. ''ఈసారి మినిమమ్ హండ్రెడ్ డిసైడ్ చేసాం'' అన్నాడు. వాళ్ళు విద్యుత్‌శాఖ వారు. పక్కన వుంచుకున్న ఐదొందలలోంచి రెండు ఏభై నోట్లు తీసి మాట్లాడకుండా ఇచ్చాను. ఈసారి నమస్కారం చెప్పకుండా వెళ్ళిపోయారు. నేను మామూళ్ళ పుస్తకం తీసి 'విద్యుత్' అని రాసి వున్నచోట 100- అంకె వేసాను.

వాళ్లు అలా వెళ్ళారో లేదో మరో దండు ఒక పదిమంది సభ్యులతో వచ్చింది. వాళ్ళు మునిసిపల్ పారిశుధ్య కార్మికులు. ఏభై నోటు తీసి అడగకుండానే ఇచ్చాను. వాళ్ళ లీడర్ అందుకోలేదు నావంక నిరసనగా చూసి ''ఎప్పుడూ ఏభై అంటే ఎల్లాగండి. కనీసం వందైనా ఇయ్యండి. అందరం పంచుకోవాలి కదా..''

''మేం చేస్తున్న చాకిరీ కనిపెట్టి మీరే ఇయ్యాల..'' పక్క స్థలంలో-ఇంటిముందు పేరుకు పోతున్న మురికి కుప్పల్ని స్ఫురణకు తెచ్చుకుని వంద ఇచ్చి పంపాను.

పావుగంట గడిచింది. ''ఎలక్ట్రిసిటీ అండి'' అంటూ ముగ్గురు యువకులు వచ్చారు.

''మీవాళ్ళు వచ్చారుకదయ్యా'' అన్నాను.

''వాళ్ళు ఆఫీసు వాళ్ళండి. మేం లైన్‌మెన్..'' అమావాస్య చీకటి గుర్తుకువచ్చి ఇచ్చిపంపాను.

వాళ్ళు వెళ్ళాక రీడింగ్ తీసేవాళ్ళూ బిల్ కలెక్టర్స్ వచ్చి తీసుకెళ్ళారు. కరెంట్ బిల్ కట్టేటప్పుడు మినిమమ్ ఐదు రూపాయలన్నా ప్రతీసారి నొక్కేస్తాడు అయినా అది వేరు ఇది వేరు 'కృష్ణార్పణం'!

''పోస్టుమాన్‌సార్..'' ఇతను ఇంటికొచ్చే పోస్టుమాన్. ఆఫీసుకొచ్చే పోస్టుమాన్ వేరు. అతను ఇంత శ్రమ తీసుకుని ఇంటి వరకూ రాడు. ఆఫీసుకే వచ్చి లిస్టుప్రకారం అందరి దగ్గరా తలా ఒక ఏభయ్యో-పాతికో వాళ్ళ వాళ్ళ కేడర్‌ని బట్టి వసూలు చేసుకుపోతాడు. ఇంకో పోస్టల్ యాక్టర్



వున్నాడు. మా ఆఫీసుకి ఎదురుగా వున్న పోస్టాఫీసులో పని చేస్తాడు ఎప్పుడన్నా ఆర్డినరీ టపా వుంటే మా మెసెంజర్ అక్కడ ఇస్తుంటాడు. ఇంత అని రోదించడు. ఏదో పరకో ఎంతిస్తే అంత..అతనికీ పాతిక నిన్ననే ఇచ్చేసాను. సరే ఇప్పుడు ఈ ఆచారి బాకీ కూడా తీరిపోయింది.

అప్పటికి నేను మామూళ్ళ నిమిత్తం కేటాయించుకున్న ఐదువందలు అయిపోయాయి. లిస్టు చూస్తే టెలికం, బ్యాంక్ ప్యూన్స్, కేబిల్ వర్కర్స్-పనిమనిషి ఇలా ఇంకా సగం మంది మిగిలిపోయారు. ఎస్టిమేషన్ మించిపోయింది. గుమ్మంలోకొచ్చి మామూలంటూ చెయ్యి చాస్తే కాదనలేం కదా. తెల్లారి అందరితోనూ పని పడుతుంది. సంవత్సరానికి ఒక్కసారే కదా పోనీ. ఇంకో ఖర్చు తగ్గించుకుంటే సరి! నేను ఆలోచిస్తుండగానే టెలికాం సిబ్బంది ఆరుగురు వచ్చారు.

''డేవిడ్ గారు చెప్పారు. 200 ఇస్తారని''

''రెండు వందలా..'' గుడ్లు మిటకరించాను.

''అవును. ఈసారి ఆఫీసర్లందరి దగ్గరా రెండు వందలు-అనుకున్నాం''

''అదేమిటి? ఆఫీసరైనా కాకపోయినా అందరూ వినియోగదారులే కదా..అయినా ప్రతీ సంవత్సరం వందే కదా..ఇస్తున్నది'' టెలిఫోన్ పెట్టించుకున్న నేరానికి రెండు వందలు మామూలు ఇవ్వగలిగే శక్తి నాలాంటి సామాన్యుడికుంటుందా? అదంతా వాళ్ళకి అనవసరం.

''ఏమిటిసార్ అంత ఆలోచిస్తున్నారు? మీరెంత అడిగితే అంత ఇచ్చేస్తారని డేవిడ్‌గారు చెప్పారు. ఈసారి జిల్లాలో మా టార్గెట్ కోటి రూపాయలు. మీరామాత్రం ఇవ్వకపోతే...''

''మీకెప్పుడు కావాలంటే అప్పుడు క్షణంలో మా సర్వీసు చేస్తున్నాం..ఆ మాత్రం కనిపెట్టకపోతే ఎలా..''

''ఎక్కడ నుంచి తెస్తామయ్యా మేం మీలా మామూలంటూ పబ్లిక్ ముందుకెళ్ళి చెయ్యి చాచలేం కదా. అయినా ఫోన్ బాగుచేసినప్పుడల్లా ఎంతో కొంత తీసుకుంటూనే వున్నారు కదా!'' అని అడగలేకపోయాను. మధ్య తరగతి మొహమాటం.

''ఫోన్ డెడైంది. పదిరోజులైంది. ఎవరూ రాలేదు.'' మామూలు సమర్పించుకుంటూ చెప్పాను.

''ఇదిగో. ఈ హడావుడి అయిపోయాక వస్తాం. డేవిడ్ గారు చెప్పారు లెండి'' పుస్తకంలో నాపేరు ఎదురుగా సొమ్ము ముట్టినట్టు టిక్ పెట్టుకుని మామూళ్ల బృందం వెళ్ళిపోయింది.

మామూళ్ళ రూపంలో నేను వదుల్చుకున్న అంకె లెక్క చూస్తే నా గుండె గుభేలుమంది. ఇంకా నెలలో పది రోజులు గడవాలి. నా మనసంతా వికలమైంది. ఎవరైనా పూనుకుని ఈ మామూళ్ళ పండగని పండగల లిస్టులోంచి తొలగిస్తే బాగుండును. టీవీలో ప్రధాని- రాష్ట్రపతి పర్వదిన సందేశం ప్రజలకు అందిస్తున్నారు.

''ఇదిగో. రెండొందలు మిగిలింది'' మా ఆవిడ నవ్వుతూ రెండు వేలలో మిగిలిన రెండు పచ్చనోట్లు ఇచ్చింది.

''వుంచు..రేపు కూడా కొందరు వస్తారు'' అన్నాను.

వీళ్ళందరూ ప్రభుత్వోద్యోగులు. సేవలకు నెలనెలా వేలాది రూపాయలు జీతాలందుకుంటున్న వాళ్ళే. ఇందులో కొన్ని డిపార్టుమెంట్స్ పండగ సందర్భంగా 2,3 నెలల బోనసు కూడా పొందారు.

''అయినా మీరు మరీని! అడిగినంతా ఇచ్చేసి పర్సు దులిపేస్తారు. అంతంత ఇవ్వలేమని చెప్పరేం. మనమేమన్నా లక్షాధికారులమా?'' సన్నసన్నగా క్లాసు తీసుకుంటోంది శ్రీమతి.

''ఏం చేస్తాం తప్పదు! అందరితోనూ మనకి పనులుంటాయి. పోనీలే సంవత్సరానికి ఒక్కసారేగా..'' లోలోపల మధనపడుతూనే సర్దిచెప్పాను.

''అందుకే అరుంధతి వాళ్ళు ఈవారం రోజులు ఊరు వదిలి వెళ్ళిపోయారు. మనం ఈసారి మనవాళ్ళింటికి పోతే సరిపోయేది.'' బాధపడుతోంది.

''అయినా తప్పదు ఇవ్వక! బాకీ రాసుకుంటారు ఇచ్చే వరకు వెంట పడతారు అప్పుతీసుకున్నట్లు చెల్లించక తప్పదు''

''మా చిన్నప్పుడు బళ్ళో పంతుళ్ళు పిల్లలందరినీ వెంట పెట్టుకుని బుక్కాలు చల్లుతూ దసరా పాటలు పాడిస్తూ ఇంటింటికీ 'అయ్యవారికి చాలు అయిదు వరహాలు..పిల్లవాళ్ళకు చాలు పప్పుబెల్లాలు..' అని సరదాగా వస్తే ఎంతో ఆదరంగా పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పేవారని ఇచ్చేవాళ్ళు. పాపం వాళ్ళు బతకలేని బడిపంతుళ్ళు. రోజులు మారిపోయాయి. పండగ మామూలు పేరు చెప్పి ప్రతివాడూ దండుకోవటమే. తెల్లారితే ఎన్ని ఖర్చులు..ఎన్ని అవసరాలు! ఈయన చూస్తే దులిపేసి కూర్చున్నారు! నెలంతా ఎలా గడపాలో..!'' శ్రీమతి లబలబ లాడుతోంది.

నేను నిర్లిప్తంగా ఆకాశంలోకి చూస్తూ ఆలోచిస్తున్నాను, ఏ లోను రెన్యూ చేసుకోవచ్చా..అని.

★

**యర్రమిల్లి విజయలక్ష్మి**